# 8

ఒళ్లంతా నొప్పులుగా, భారంగా ఉంది. మెలకువ వస్తూ, పోతూ ఉన్నట్లుగా ఉంది. ఏమైంది నాకు...? అప్పుడప్పుడూ మందులేవో మింగుతున్నట్లు తెలుస్తోంది. పక్కకు ఒత్తిగిలబోయిన నేను అత్తయ్య మాటలు వినిపించి కదలకుండా అలాగే ఉండిపోయాను.

“నేను కూర్చుంటాను గానీ నువ్వెళ్లి కాసేపు నడుం వాల్చు... ఇంతమందిమి ఉన్నాం... నీ చాదస్తం కాకపోతే నువ్వే ఎందుకు కనిపెట్టుకుని కూర్చోవటం... రెండు రోజులుగా నీకు నిద్ర లేదు...” చిన్నత్తయ్య అలా మాట్లాడుతోంటే నాకు ఆశ్చర్యమనిపించింది.

అంతకుముందు అత్తయ్య కంఠస్వరం వినిపించింది. అంటే చిన్నత్తయ్య మాట్లాడుతున్నది అత్తయ్యతోనా..?! వీళ్లిద్దరూ ఈ గదిలో ఎందుకు ఉన్నారు? అత్తయ్య కనిపెట్టుకుని చూస్తున్నది ఎవరిని.. నన్నా...?!

"సమయానికి విష్ణు లేడు... ఒళ్లెరగని అంత జ్వరంతో అలా పడివుంటే... నాకు గదిలో కూర్చున్నా స్థిమితంగా ఉండటం లేదు.."

అత్తయ్య మాటలు పూర్తికాకముందే చిన్నత్తయ్య మళ్ళీ అన్నారు. "బావుంది.. కంగారు పడాల్సిన పనేం లేదని డాక్టరు చెప్పారు కదా అక్కయ్యా! ఈ ఇంటికి వచ్చి ఇన్నాళ్లయినా నువ్వు పలుకరించడం చూడనే లేదు! ఇప్పుడేమో... తిండి తిప్పలూ కూడా మానేసినట్లుగా పక్కనే కూర్చుంటున్నావు.. ఏమిటో .. విచిత్రంగానే ఉంది!"

తనలో తానే అనుకుంటున్నట్లుగా అత్తయ్య కంఠం చాలా మెల్లగా వినిపించింది. "శ్రీలక్ష్మి ఇంకా ఇక్కడే తిరుగుతున్నట్లుగా అనిపిస్తోంది నాకు! మర్చి పోలేకపోతున్నాను... నాకెవరిమీదా కోపం లేదు.... తప్పు చేసినందుకు బాధ పడుతున్నాను.. అంతే! ముందు ముందు ఏం జరుగుతుందో అనే ఆలోచన లేకుండా... అంతా నా చేతుల్లోనే ఉన్నట్లుగా భ్రమలో పడి... చిన్నప్పటి నుండీ 'కోడలు' అంటూ తన మనసులో లేని పోని ఆలోచనలు, ఆశలు కల్పించటం.. నా తప్పేగా..."

నేను స్పృహలో లేననే ఉద్దేశ్యంతోనే ఇద్దరూ మెల్లగా మాట్లాడుకుంటున్నారు కాబోలు.

శ్రీలక్ష్మి మరణానికి నేనే కారణమని అత్తయ్య అనుకోవటం లేదు! అది తన తప్పేనని తననే నిందించుకుంటున్నారు! నన్ను పలుకరించకపోవటానికి కారణం... బాధే గానీ నామీద కోపమేమీ లేదట!

నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది!

అత్తయ్య పట్ల గౌరవాభిమానాలు పెరిగిపోయాయి!

ఇంటికి వచ్చిన వాళ్లు మనకి అయిష్టులైనా, నచ్చని వ్యక్తులైనా గానీ మర్యాద కోసం పలుకరిస్తాం. అత్తయ్య అలాంటి కనీస మర్యాదనైనా నా పట్ల చూపించలేదని ఇన్నాళ్లూ అనుకుంటున్నానే గానీ అత్తయ్యలో ఇంతటి దుఃఖం, ఆవేదన గూడు కట్టుకుని ఉన్నాయని ఊహించలేకపోయాను!

"ఏమిటి.. మీరిద్దరూ ఇక్కడే ఉన్నారా... ఇక నాకేం పనిలేదు. వదిన దగ్గర నేనుంటాను. మీరెళ్లండి..." నీరజ వచ్చినట్లుంది.. వాళ్లతో చెబుతోంది.

నేను అలాగే కళ్లు మూసుకుని కదలకుండా ఉండిపోయాను.

నుదుటి మీద చల్లని చేతి స్పర్శ తగిలి... ఒక్కసారి ఒళ్లంతా ఏదో కుదుపు.. చిన్న పులకింత..! “ఫర్వాలేదు... టెంపరేచర్ మామూలుగానే ఉన్నట్లుంది..” అవి అత్తయ్య మాటలే! జ్వరం తగ్గిందో లేదో తెలుసుకోవటానికి నా నుదురు మీద చేయి వేశారన్నమాట!!

ఒక్క ఉదటున లేచి అత్తయ్య రెండు చేతులూ పట్టుకుని... మనసులోని దుఃఖమంతా తీరేలా ఏడ్చేయ్యాలనిపించింది! నిగ్రహించుకున్నాను.

నాకు తెలీదు..నిజంగా తెలియదు... విష్ణుకు నిశ్చయమైన అమ్మాయి శ్రీలక్ష్మి ఉందనే విషయం నాకు... నిజంగానే తెలియదు.. ఈ తప్పు నాకు తెలియకుండానే జరిగింది... గట్టిగా... అరిచి చెప్పబోతున్నట్టుగా మనసులోనే అనుకున్నాను.

నీరజ నా చేయి పట్టుకోగానే నేను మెల్లగా కళ్లు తెరిచాను.

నీరజ చాలా సంభ్రమంగా “హమ్మయ్య... నీకు మెలకువ వచ్చిందా..” అంటూఏవో రెండు మూడు టాబ్లెట్స్ నా చేత మింగించింది. టెంపరేచర్ చూసింది.

“అబ్బ.. ఇప్పటికి నార్మల్‌కి వచ్చింది! ఈ రెండు రోజులూ అందరం ఎంత కంగారు పడ్డామో నీకు తెలియదు! నువ్వు స్పృహలో లేవు.. హఠాత్తుగా జ్వరం వచ్చేసింది. అన్నయ్యకేమో ప్రయాణం మానటానికి వీల్లేని పరిస్థితి! అన్నయ్య ఒక్కడూ వెళ్లటం కాదుగా, ఆయనెవరికో వీలు కాదేమోనని సందేహంగా అంటే, అన్నయ్యే తప్పనిసరి అని చెప్పి ఒప్పించాడట. అందుకనే వెళ్లలేక, మానుకోలేక సతమతమవుతుంటే.. నేనే అందరం ఉన్నాం కదా, కంగారెందుకని వెళ్లమని చెప్పాను. వెళ్లాడేగానీ మనసంతా ఇక్కడే ఉన్నట్లుంది. గంటకోసారి ఫోను చేస్తున్నాడు. మీ నాన్నగారు కూడా రెండు సార్లుచేశారు. ఇంత జ్వరం ఉందని తెలిస్తే కంగారు పడతారేమోనని తలనొప్పిగా ఉండి నిద్రపోతున్నావని చెప్పాను. ఇప్పుడు ఫోను చేసి మాట్లాడు...”

నీరజ అలా గడగడా చెప్పుకుపోతోంది. అప్రయత్నంగా నాకు కళ్ల వెంబడి నీళ్లు జాలువారాయి.

నీరజ నా పక్కనే కూర్చుంది. “నేను అనవసరంగా .. జరిగిపోయిన విషయాలు చెప్పి నీ మనసు పాడుచేశానేమోనని బాధపడ్డాను. నీకు హఠాత్తుగా అంత జ్వరం వచ్చేసరికి... కంగారు పడ్డాను. జరిగిపోయిన వాటిని మనమేమీ సరిచేయలేం.. మన చేతుల్లో లేనిదాని కోసం అనవసరంగా బాధపడటం ఎందుకు చెప్పు.. అందుకే అన్నయ్య నీకు చెప్పలేదు... నువ్విక అదంతా మరిచిపో వదినా...” నొచ్చుకుంటున్నట్లుగా అంది.

నేనేం మాట్లాడకుండా నిర్లిప్తంగా ఉండిపోయాను.

రెండు రోజులకి నీరసం తగ్గింది. మామూలుగానే ఉన్నాను. కానీ మనసులోని భారం... ఏదో అపరాధ భావం అలాగే ఉంది!

శ్రీనిలయంలో.... ఎటు చూసినా నాకు శ్రీలక్ష్మే కనిపిస్తోంది. నేను చూసిన ఆల్బమ్‌లోని ఫోటోలు నా మనసులో అంత గాఢమైన ముద్ర వేశాయి కాబోలు! మేడ మెట్ల మీదుగా తను పరుగులు పెడుతూంటే... తన కాలి పట్టీల మువ్వల శబ్దం నాకు వినబడుతున్నట్లుగా ... అందరి మధ్యా కూర్చుని కబుర్లు చెబుతూ పెద్దగా నవ్వుతుంటే... ఆ నవ్వులు ఇల్లంతా ప్రతిధ్వనిస్తున్నట్లుగా.. ఏమిటీ భ్రమలు..?!

నా పరిస్థితి ఎప్పటికీ ఇలాగే ఉంటుందా...! శ్రీలక్ష్మితో నాకేమీ పరిచయం లేదు. కేవలం తన గురించి విన్నానంతే. అయినా నాకే ఇంత దుఃఖం ఉంటే.. గాఢమైన అనుబంధం ఉన్న అత్తయ్యకీ, ఈ ఇంట్లో వాళ్లందరికీ ఇంకెలా ఉంటుంది...?! నాకు తెలియకుండానే అయినా నా వల్ల తప్పు జరిగింది కాబట్టే నాకింత వేదన కలుగుతోందా..?!

విష్ణు ఊరు నుండి వచ్చారు. తలెత్తి తన వేపు సూటిగా చూడటానికి కూడా ఏదో సంకోచంగా అనిపించింది! ఎందుకో తెలియదు. తల వొంచుకుని మౌనంగా కూర్చుండిపోయాను.

విష్ణు నా గడ్డం కింద అరచేతిని ఉంచి నా తల పైకెత్తి నా వేపు సూటిగా చూస్తూ "సుజీ... నేనేం చెప్పినా.. నీకు నిజమే చెబుతానని నమ్ముతావు కదూ....?" అన్నారు.

నేను అవునన్నట్లుగా తలవూపాను.

ఏం చెబుతారు.. చిన్నప్పటినుండీ ఇష్టపడిన శ్రీలక్ష్మి మీద ఎందుకు వైముఖ్యం వచ్చింది. ... నా పట్ల ప్రేమ కలగటానికి కారణం ఏమిటి... ఏం చెబుతారు..?!

విష్ణు బెడ్‌కి ఆనుకుని నా పక్కనే కూర్చున్నారు. ఒక నిముషం చూపుడు వేలితో గాలిలో గీతలు గీస్తూ... ఏదో ఆలోచిస్తున్నట్లుగా మౌనంగా ఉండిపోయారు.

తర్వాత చాలా మెల్లగా తనలో తను అనుకుంటున్నట్లుగా మొదలు పెట్టారు.

"శ్రీలక్ష్మి చిన్నప్పటి నుండీ మా మధ్య ఇక్కడే పెరిగింది. శ్రీలక్ష్మి అంటే అందరికీ అభిమానమే. నాకూ అంతే. ఆ ఇష్టంలో ప్రత్యేకత ఏమీ లేదు. శ్రీలక్ష్మి పట్ల నా

కాబోయే భార్యగా నా ఊహలెపుడూ అలా సరదాగా సాగలేదు. బహుశా చిన్నప్పటినుండీ ఇక్కడే పెరగడం ఒక కారణం అయి ఉండొచ్చు. ఈ ఇంటి కోడలిగా, నా కాబోయే భార్యగా తన మీద ముద్ర పడిపోయింది. మేం పెద్దయ్యాక అయినా పెద్దవాళ్లెపుడూ మా ఇష్టాలేమిటో కనుక్కోలేదు. నేను కూడా పెద్దల నిర్ణయాన్ని గౌరవించి మౌనంగా ఉండిపోయాను.

ఒకసారెపుడో నేను పరధ్యానంగా ఏపిల్ కోస్తూ వేలు కోసుకున్నాను. అప్పుడే బజారుకు వెళ్లొచ్చిన శ్రీలక్ష్మి అమ్మకి తను కొనుక్కున్న కొత్త చీరెను చూపిస్తూ. నా వేలి నుండి కారుతున్న రక్తాన్ని గమనించి, చటుక్కున ఆ చీరె ఒకవేపు నా వేలికి చుట్టేసింది. శ్రీలక్ష్మిది చాలా సున్నితమైన మనసు. కొంచెం బాధ కూడా తట్టుకోలేదు. నా వేలే కాదు, ఎవరిది.. అమ్మదయినా, నీరజదయినా కంగారుతో అలాగే చేసి ఉండేది. కానీ అది గమనించకుండా అందరూ అది శ్రీలక్ష్మికి నాపట్ల వున్న ప్రేమకి తార్కాణమంటూ సరదాగా చెప్పుకుని నవ్వుకున్నారు! చెప్పుకుంటే ఇలాంటివి చాలానే ఉంటాయి!

శ్రీలక్ష్మి సరదాగా కబుర్లు చెబుతూ అందర్నీ నవ్వించటమే కాదు, చాలా చిలిపి పనులూ చేస్తుండేది. అలా తను చేసిన తమాషా పనే ఈ విషాదానికి కారణం అయింది! అది తెలుసుకోకపోవటం, అలా ఊహించలేకపోవటంలో నా తప్పూ ఉంది!

ఆ రోజు నేను పనిమీద ఎక్కడికో వెళ్తోంటే... తిరిగి వచ్చేటపుడు దారే కాబట్టి చెన్నూరు వెళ్లి శ్రీలక్ష్మిని తీసుకురమ్మని అమ్మ పురమాయించింది.

సాయంకాలం చల్లగా, హాయిగా ఉంది. అటూ ఇటూ చెట్లు... నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు మీద నడవటం బావుంటుందనిపించి డ్రైవరును ఫర్లాంగు దూరంలో కనిపిస్తున్న చెట్టు దగ్గరకు వెళ్లి ఆగమని చెప్పాను.

కొంచెం దూరం నడిచే సరికి శ్రీలక్ష్మి "అబ్బ.. నడవటం బోర్‌గా ఉంది బావా..." అంటూ రోడ్డు వారగా ఉన్న పెద్ద చెట్టు దగ్గరకు వెళ్లి ఆనుకుని నిలబడింది.

"నాలుగడుగులకే నీకు విసుగొచ్చిందా... జీవితాంతం నాతో కలిసి ప్రయాణం చేయాలి మరి!" సరదాగా అన్నాను.

శ్రీలక్ష్మి ఫక్కున నవ్వింది. "నువ్విలా రోడ్డు మీద నడుస్తూ ఉంటే.. నేనూ నీకు తోడుగా నడుస్తూ ఉండాలా?" అంది. వెంటనే కొంచెం సీరియస్‌గా చూస్తూ "బావా.. నేనొకటి అడుగుతాను.. ఏమనుకోకుండా నిజంగా నిజమే చెబుతావా?" అనడిగింది.

"నేను నిజం చెప్పనేమోననే అనుమానం నీకెందుకు వచ్చిందీ... అడుగు" అన్నాను. ఒక నిముషం ఏదో ఆలోచిస్తున్నట్లుగా ఉండి తర్వాత మెల్లగా "నేను .. ఎవరినైనా ఇష్టపడి... పెళ్లి చేసుకోవాలనుకుంటే... నువ్వు బాధ పడతావా... కోపం వస్తుందా..? నిజం ..నిజమే చెప్పాలి..." అంది.

ఊహించని ప్రశ్నకి ఆశ్చర్యపోయాను.

శ్రీలక్ష్మి వైపు నిశితంగా చూశాను. చూపులు క్రిందకు వాల్చేసింది.

నేను పెద్దగా ఆలోచించకుండా వెంటనే చెప్పేశాను "నువ్వు ఎవరినైనా ఇష్టపడి పెళ్లి చేసుకుంటానంటే నేనెందుకు బాధపడతాను..? నీ ఇష్టం నాకూ ఇష్టమే! నువ్వీ మాట చెప్పకుండా మనసులోనే బాధపడితే కోపం వస్తుందిగానీ... చెప్పావు కాబట్టి కోపమేమీ లేదు! అయినా కోపం తెచ్చుకోవాల్సిన సంగతేముందీ?"

నేను శ్రీలక్ష్మితో ఎపుడూ ఒంటరిగా కూర్చుని మాట్లాడలేదు. అవసరానికే తప్ప మా మధ్య కబుర్లు ఉండవు. మేమిద్దరమే మాట్లాడుకున్నది ఆ రోజు మాత్రమే.

నా మాటలు వింటూనే ఎందుకోగానీ శ్రీలక్ష్మి ఫక్కున నవ్వింది. నేను "ఎందుకూ.. " అనడిగితే "ఏం లేదులే.. ఏదో గుర్తుకొచ్చి.." అంది.

"ఏం గుర్తుకు వచ్చింది?" అనడిగితే "తరువాత చెబుతాలే..." అంటూ మళ్లీ నవ్వింది. తను ఇష్టపడ్డ వ్యక్తి ఎవరు, ఏమిటి అనడిగితే "అది తర్వాత చెబుతా" అంది. "ఈ విషయం అత్తమ్మకి నా ద్వారానే తెలియాలి. నేను చెప్పేంతవరకు నువ్వు మాత్రం ఎవరితోనూ చెప్పటానికి వీల్లేదు. సరేనా..?" అంటూ నా దగ్గర మాట తీసుకుంది.

అమ్మ మా పెళ్లి గురించి ఎన్నిరకాలుగా ఆలోచనలు చేస్తోందో నాకు తెలుసు. ఎవరింటికి పెళ్లికి వెళ్లినా... అన్ని విషయాలను శ్రద్ధగా పరిశీలించటం ఒక అలవాటయిపోయింది. ఏమైనా లోటు పాట్లు గమనిస్తే, అలాంటివి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, బాగున్న ఏర్పాట్లను ఇంకా మెరుగ్గా ఎలా చేయవచ్చో.. ఇలా అమ్మ ఆలోచిస్తోందేది! శ్రీలక్ష్మి నిర్ణయం అందరికంటే అమ్మనే ఎక్కువగా కృంగదీస్తుందని నాకు తెలుసు. శ్రీలక్ష్మి ఆనందమే ముఖ్యం కాబట్టి తను ప్రేమించిన వ్యక్తితో పెళ్లి జరిపించటమే మంచిదని అమ్మకి నచ్చచెప్పి... చిన్నప్పటినుంచీ పెంచినందుకు కూతురే అనుకుని పెళ్లి చేసి పంపించమని ధైర్యం చెప్పాలని మనసులోనే అనుకున్నాను.

నువ్వు స్టేజిపై మాట్లాడుతుండగా మొదటి సారి చూసినపుడు.. నీలోని అందమైన ఆవేశం, మాటతీరు నన్ను ఆకట్టుకున్నాయి! అనుకోకుండా మీ ఇంటికి రావాల్సిన పని కలగటం.. ఆ తరువాత మళ్లీ మళ్లీ లాయరుగారింట్లో కలుసుకోవటంతో నీతో పరిచయం పెరిగింది. మంచి వ్యక్తిత్వం గల అమ్మాయిగా నీ పట్ల నాకు ఆకర్షణ, ఇష్టం ఏర్పడ్డాయి! నాకు తెలిసిన ఎందరో అందమైన అమ్మాయిల్లో లేని ప్రత్యేకతలేవో నీలో నాకు కనిపించాయి! శ్రీలక్ష్మి తన ప్రేమ విషయం నాకు చెప్పి ఉండకపోతే.. నేను అమ్మవాళ్ల నిర్ణయానికి కట్టుబడి నా ఇష్టాన్ని మనసులోనే ఉంచుకుని, నిన్ను ఒక మంచి స్నేహితురాలిగా మాత్రమే గుర్తుంచుకునేవాడిని! శ్రీలక్ష్మికి ఇంకెవరినో పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం ఉందని తెలియగానే... నాకున్న సంకెళ్లు విడిపోయి.. మనసుకేదో స్వేచ్ఛ లభించినట్లయింది! అందుకే నిస్సంకోచంగా నా ఇష్టాన్ని నీకు చెప్పగలిగాను!

తన ప్రేమ విషయాన్ని విని అమ్మ తట్టుకోలేదేమోననే సంకోచంతో శ్రీలక్ష్మి చెప్పలేకపోతోందేమోననే సందేహం కలిగింది. ముందుగా నేనే నా విషయం అమ్మకు చెబితే, అప్పుడు శ్రీలక్ష్మి బెరుకులేకుండా నిర్భయంగా తన గురించీ అమ్మకు చెబుతుందనే ఆలోచన వచ్చింది. ఫోనులో అయితే అమ్మకు సమాధానాలు చెప్పాల్సి వస్తుందని, ఉత్తరం రాయటమే బాగుంటుందని నెల్లూరు నుండి రాశాను.

నేను ఇంటికి వెళ్లేసరికి... శ్రీలక్ష్మి ఆత్మహత్య చేసుకుందనే పిడుగులాంటి వార్త విన్నాను! ఇల్లంతా గందరగోళంగా ఉంది! నాన్న గారిని హాస్పిటల్‌లో చేర్చాల్సి వచ్చింది! శ్రీలక్ష్మి అలా ఎందుకు చేసిందో అర్థం చేసుకోలేని అయోమయంలో నేనుంటే.. అమ్మ నిందారోపణలు మరింత బాధించాయి!

అప్పుడు హఠాత్తుగా నాకో ఆలోచన వచ్చింది... శ్రీలక్ష్మి నాతో చెప్పిన తన ప్రేమ విషయం నిజం కాదేమో... తమాషా చేసిందని! అందుకే తను చెప్పగానే నేను నిజమేనని నమ్మి నాకేం కోపం, బాధ లేదని చెబుతోంటే... నవ్వాపుకోలేక నవ్విందన్నమాట! తను తమాషా చేస్తే... నేను సీరియస్‌గా మాట్లాడిన మాటలు అందరికీ ఆ తర్వాతెప్పుడో చెప్పి నవ్వించాలి అనుకుంది కాబోలు! శ్రీలక్ష్మి చేసే తమాషా పనుల గురించి తెలిసినా నాకెందుకో ఆ ఆలోచన అప్పుడు రాలేదు. నిజమేనని నమ్మాను. ఈ మాట అప్పుడు.. అనర్థం జరిగిపోయాక చెప్పటం వలన ప్రయోజనమూ లేదు... సమంజసమూ కాదనిపించి మౌనంగా ఉండిపోయాను. ఒకవేళ నేనిలా పొరబడ్డానని చెప్పినా.. మన మధ్య పెరిగిన పిల్ల ఎవరో ఏమిటో చెప్పకుండా ప్రేమించానని అంటే

అది తమాషాయేనని ఎలా తెలుసుకోలేకపోయావురా అని అమ్మ నిలదీస్తుంది! దానికి నా దగ్గర సమాధానం లేదు!

'నువ్వు లేని జీవితమే వద్దనుకుని... నీ ప్రేమకు అడ్డంకి కాకూడదని తనే వెళ్లిపోయింది'. అంటూ అమ్మ నన్ను పట్టుకుని విలపిస్తోంటే... 'ఎందుకింత పిచ్చితనంగా ప్రవర్తించావ్.. శ్రీలక్ష్మి.. ఎందుకింత తొందరపడ్డావ్...' అని మనసులోనే నేను మథనపడటం తప్ప చేయగలిగిందేమీ లేకపోయింది!

శ్రీలక్ష్మి మరణం, నాన్నగారి అనారోగ్యంతో ఇంటా బయటా పరిస్థితులన్నీ అస్తవ్యస్తమై పోయాయి. చదువైందగ్గర్నుండి బిజినెస్‌లో నాన్నగారికి తోడుగా ఉంటున్నాను. కానీ పూర్తిగా నాన్నగారి సలహాలు ప్రమేయం లేకుండా నేనే బిజినెస్ వ్యవహారాలు చూసుకోవాల్సి రావటంతో పార్టనర్స్‌తో చిక్కులు ఎక్కువయ్యాయి. ఇక ఇంట్లో పరిస్థితి చెప్పనే అక్కర్లేదు! శ్రీలక్ష్మి మరణంతో.. ఇట్లో వాళ్లందరిమధ్యవున్న అపురూపమైన ఆత్మీయాను బంధమేదో తెగిపోయి ఎవరికి వారేగా నిశ్శబ్దమైపోయారు! మరమనుషుల్లా తిరుగుతూ పనులు చక్కబెట్టుతున్నారంతే. అటువంటి పరిస్థితికి నాకు తెలియకుండానే నేను కారణమయ్యాను! అన్నిటికంటే అమ్మ మౌనమే నాకు మరింత శిక్షగా మారింది!

అవసరమైతే తప్ప మాట్లాడటం లేదు. మాట్లాడినప్పుడు అమ్మవేపు నేను సూటిగా చూడలేకపోయేవాడిని.

రోజులు గడిచేకొద్దీ ఇంట్లో నాకు ఊపిరాడనట్లుగా ఉండటంతో... నీతోడు కావాలనిపించి పెళ్ళికి సిద్ధపడ్డాను. అయితే నీ పరిస్థితి ఇంత ఇబ్బందికరంగా ఉంటుందని మాత్రం ఊహించలేకపోయాను. లేకపోతే ఇంకా కొన్నాళ్లు ఆగేవాడినే!

ఇప్పుడు చెప్పు.. సుజీ... నేను తెలిసి చేసిన తప్పేమైనా ఉందా? శ్రీలక్ష్మికి నేను అన్యాయం చేశానంటావా..?" విష్ణు కంఠం బరువుగా ఉంది.

శ్రీలక్ష్మి మరణానికి కారణమయ్యానేమోనని నాలుగు రోజులుగా నేననుభవిస్తున్న వ్యథ విష్ణు మనసులో ఎప్పటినుంచో ఉందన్నమాట!

నా మనసు ఆర్ద్రమైంది.

కళ్లు తుడుచుకుని విష్ణు భుజంపై తల వాల్చాను. అంతకుమించి నేను ఏం చెప్పగలను!

నా సమాధానం అర్థమైనట్లుగా విష్ణు నా భుజం చుట్టూ చేయి వేశారు.

❋ ❀ ❋

శ్రీలక్ష్మి నాకూ ఆత్మీయురాలే అనిపించేది! తన ఆలోచనలు నన్ను వదిలి పెట్టడంలేదు! తన గురించి అందరితోనూ మాట్లాడాలని, నా గురించి వాళ్లేమనుకుంటున్నారో తెలుసుకోవాలనీ అనిపించేది! శ్రీలక్ష్మి దూరమై చాలానాళ్లయినా, తను నిన్నో మొన్నో మరణించినట్లుగా తన జ్ఞాపకాలు అందరిలోనూ ఇంకా తడితడిగానే ఉన్నాయి!

శాంతమ్మ దగ్గర శ్రీలక్ష్మి ప్రస్తావన తెస్తే, చిన్న వయసులోనే అంత గొప్ప మనసు ఎవరికీ ఉండదంటూ శ్రీలక్ష్మి జ్ఞాపకాలను నెమరేసుకుని కళ్లు తుడుచుకుంది. శాంతమ్మకి కొంచెం నలతగా ఉన్నా, తలనొప్పి వచ్చినా ఆ విషయం తను ఎవరికీ చెప్పకపోయినా శ్రీలక్ష్మి మాత్రం తెలుసుకునేది.. వంటగదిలోకి రావద్దంటూ వార్నింగ్ ఇచ్చి రెస్టు తీసుకునే వరకూ వూరుకునేది కాదట!

తోటమాలి యాదయ్యా అలాగే చెప్పాడు. ఒకసారి పరధ్యానంగా పనిచేస్తుంటే శ్రీలక్ష్మి గమనించి సంగతేమిటంటూ ఆరా తీసింది. ఇంట్లో పరిస్థితి గురించి బాధపడుతూ చెప్పాడు. పురిటికని పుట్టింటికి వచ్చిన కూతురిని అత్తారింటికి పంపించాలని పెద్దయ్యగారినడిగి డబ్బు తీసుకున్నాడు. కానీ ఆ డబ్బులు సారా కొట్లో జమచేశాడు. ఆ విషయం చెప్పి డబ్బులు అడగలేడు.. అడగకపోతే ఇంకో మార్గమూ లేదు. ఈ విషయం విన్న శ్రీలక్ష్మి ఆ డబ్బు తను ఇస్తానంటే.. చిన్న పిల్లల దగ్గర తీసుకోకూడదని అన్నాడట. అందుకని అప్పుడే బయటకు వెళ్లబోతున్న చంద్ర ప్రసాద్ గారిని శ్రీలక్ష్మి పిలిచి 'మామయ్యా.. ఈ ఇంట్లో నా స్థానం ఏమిటి.. నేనెవరిని?' అని అడిగింది. ఆయన నవ్వుతూ 'నువ్వు ఈ ఇంటి కాబోయే పెద్ద కోడలివి.. యజమానురాలివమ్మా' అని చెప్పే సరికి 'నిజం కదా, కానీ ఈ తాత చూడు.. నాకేమీ అధికారం లేనట్లుగా ఎవరికీ ఏమీ ఇవ్వకూడదంటున్నాడు' అంటూ ఫిర్యాదు చేసింది.

దాంతో విషయం తెలుసుకున్న చంద్రప్రసాద్ గారు అతన్ని మందలించి మళ్లీ డబ్బులిచ్చారట. 'పనివాళ్ల కష్టసుఖాలను ఆ తల్లి అలా కనిపెట్టి చూసేది' అంటూ ఆకాశం వేపు చూస్తూ యాదయ్య చేతులెత్తి దండం పెట్టుకున్నాడు!

అలా అందరి మనసుల్లోనూ అంతటి అపురూపమైన స్థానాన్ని సంపాదించుకున్న శ్రీలక్ష్మి నిజంగా చాలా అదృష్టవంతురాలు! కానీ... అందరి ఆప్యాయతానురాగాలతో యువరాణిలా పెరిగిన శ్రీలక్ష్మి చేజేతులా ప్రాణాన్ని తీసుకునే పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చినందుకు ఒక రకంగా దురదృష్టవంతురాలు!

వీళ్లందరూ నా గురించి ఏమనుకుంటున్నారు..? దేవతలాంటి శ్రీలక్ష్మి మరణానికి నేనే కారణమని నిందిస్తూ శపిస్తూ ఉంటారా..? ఎంత వద్దనుకున్నా తరచూ ఇలాంటి ఆలోచనలే మనసును ముట్టడిచేస్తూ బలహీన పరుస్తున్నాయి!

నా ప్రమేయం ఇసుమంతైనా లేకుండా జరిగిన విషయానికి నేనెలా బాధ్యురాలిని అవుతాను! అని నన్ను నేనే ఓదార్చుకోవటం తప్ప చేయగలిగిందేమీ లేదు!

* ❀ *

రోజులు గడిచిపోతున్నాయి.

శ్రీనిలయంలో ఘనీభవించిన నిర్లిప్తత, నిశ్శబ్దం క్రమేపీ కరుగుతున్నాయి. సందడి ప్రారంభం అయిది. దానికి కారణం కృష్ణప్రసాద్ పెళ్లి నిశ్చయమవటమే. కోదండంగారికి శ్రీలక్ష్మి తర్వాత కవల పిల్లలు అమ్మాయిలు పుట్టారు. ఒకమ్మాయి రజితను నెల్లూరులో ఉండే దూరపు బంధువులకు పెంపకానికి ఇస్తే, ఇంకొక అమ్మాయి వినుత చెన్నూరులో కోదండం గారి దగ్గరే ఉంటోందట. ఇప్పుడు కృష్ణ ప్రసాద్‌కి మామయ్య కూతురు రజితతోనే పెళ్లి నిశ్చయమైంది.

కృష్ణ ప్రసాద్‌కి ఇంకో రెండు మూడేళ్ల వరకూ పెళ్లి చేసుకోవాలని లేదు. ఆ పైన మెడిసిన్ చదివిన అమ్మాయినే చేసుకోవాలనే ఉద్దేశ్యమూ ఉంది. ఈ ఇంటికి పెద్దకోడలుగా రావాల్సిన ఒక కూతురు చనిపోయింది. ఇంకొక అమ్మాయైనా రెండో కోడలుగా రావాల్సిందేనని కోదండంగారు గట్టిగా పట్టుబట్టటంతో కృష్ణ ప్రసాద్ తన అభిప్రాయాన్ని మార్చుకోక తప్పలేదు. “నేను చేసిన పొరపాటు తమ్ముడికి ఇలాంటి ఇబ్బంది తెచ్చి పెట్టింది” అన్నారు విష్ణు బాధపడుతూ.

“వ్యాధికి మందు ఉంటుంది గానీ విధికి ఉంటుందా అని సామెత ఉంది! కొన్ని కొన్ని సంఘటనలు అలా జరిగిపోతుంటాయి.. మనం చేయగలిగిందేం ఉండదు...” అన్నాను నచ్చచెబుతున్నట్లుగా.

విష్ణు ఫక్కున నవ్వేసరికి ఆశ్చర్యంగా చూశాను.

"ఇప్పుడు నీ మాటలు నీవిలా లేవు! అచ్చం కామాక్షి పిన్ని మాటల్లా ఉన్నాయి!" అన్నారు. మళ్ళీ నవ్వుతూ.

అవును నిజమే... ఆవిడ ప్రతీ మాటకూ ఒక సామెతను జోడిస్తుంటారు. అందుకే విష్ణుకు నా మాటలు ఆవిడ మాటల్లా అనిపించాయన్నమాట! నాకూ నవ్వొచ్చింది.

ఒక నిముషం తర్వాత "నేను చాలా అదృష్టవంతుడిని.." అన్నారు.

"ఎందుకనో..?"

"నిన్ను.. పొందగలిగినందుకే! నీకు ఆవేశం కొంచెం ఎక్కువని అనుకునేవాణ్ణి. ఆవేశమే కాదు, సహనం, వివేకం కూడా ఎక్కువేనని తెలిసింది. అందువలనే అయిదారు రీళ్ల విరహబాధ తప్పింది!"

మధ్యలో అడ్డం వెళ్లి "రీళ్లేమిటి...?" ఆశ్చర్యంగా అడిగాను.

"సారీ... రీళ్లు కాదు.. ఏళ్లు! సినిమాల్లో మామూలేగా, అపార్థం చేసుకున్న హీరోయిన్ హీరో చెప్పబోతున్న మాటల్ని ఆవేశంతో 'వినను... వినను..' అంటూ ఛీ కొట్టి వెళ్లిపోయి అదే.. అయిదారు రీళ్ల సినిమా తర్వాత.. అసలు విషయం తెలుసుకుని పశ్చాత్తాపపడి దగ్గరవుతుంది! ఆ రోజు నీ ఆవేశం, దుఃఖం చూసి నేను చాలా టెన్షన్ పడ్డాను... నేను చెప్పే మాటల్ని నిజమేనని నువ్వు నమ్ముతావా... సరిగ్గా అర్థం చేసుకుంటావా అని! నువ్వు నమ్మావు, అర్థం చేసుకున్నావు కాబట్టి ఎడబాటు తప్పిందికదా!" చిరునవ్వుతో అన్నారు.

నేను నిట్టూర్చాను. "ఆలోచిస్తే.. శ్రీలక్ష్మి చాలా తొందరపడిందని నాకనిపించింది. ప్రేమయినా... ఇంకేదైనా సరే జీవితం కంటే ఎక్కువ కాదుగదా! మిమ్మల్ని తప్ప ఇంకెవర్నీ భర్తగా అంగీకరించలేదనుకుంటే.. ఆ విషయం మీతో అయినా అత్తయ్యతో అయినా మాట్లాడకుండా మీ ప్రేమకు అడ్డం అవుతానేమోనని ప్రాణాలు తీసుకోవటం.. చాలా తొందరపాటే కదూ? తన మరణం తన ఆప్తులను ఎంత కృంగదీస్తుందో ఒక క్షణం ఆలోచించివుంటే అలా చేసి వుండేది కాదుగా...!" అన్నాను.

ఎవరికైనా ఎవరినైనా ప్రేమించే హక్కు ఉంటుంది. సమస్య వస్తే పరిష్కారం కోసం ప్రయత్నించాలిగానీ ప్రాణాలనే బలి ఇవ్వటం వలన ప్రయోజనం ఏముంటుందీ..!

విష్ణు ఏదో ఆలోచనలోకి జారిపోయినట్లుగా నిశ్శబ్దంగా ఉండిపోయారు. కుడిచేతి చూపుడు వేలు అలవాటు ప్రకారం గాలిలో రాస్తుంటే... ఆ చేతిని పట్టుకుని "ఏమిటంత ఆలోచన?" అనడిగాను.

"తమ్ముడి పెళ్లి గురించే.. కొన్నాళ్లు బిజినెస్ వ్యవహారాలు పక్కన పెట్టి పెళ్లి ఏర్పాట్ల మీదే దృష్టి పెట్టాలి. అమ్మ కోరిక ప్రకారం గ్రాండ్‌గా చేయాల్సి ఉంటుంది".

"అవును. మన పెళ్లి బంధువులే కాదు, ఇంట్లో వాళ్లు అయినా రాకుండానే రిజిస్ట్రారు ఆఫీసులో జరిగిపోయింది. కృష్ణ ప్రసాద్ పెళ్లి అయినా అత్తయ్యకు సంతృప్తి, సంతోషం కలిగేలా వైభవంగా జరగాలి! అందులోనూ ఈ సంబంధం.. అత్తయ్యకు ఇష్టమైనది.. పెళ్లికూతురు స్వంత మేనకోడలు కదా!" అన్నాను.

విష్ణు నావేపు ఒక క్షణం పరిశీలనగా చూసి "నేను నా పరిస్థితులు, నా ఇష్టం గురించే ఆలోచించాననిపిస్తోంది. పెళ్లి మామూలుగా జరగలేదనే అసంతృప్తి .. నీకు... ఉంది కదూ?" అన్నారు.

లేదన్నట్లుగా తల వూపాను. "పెళ్లి అందరి మధ్యా జరగలేదనే అసంతృప్తి రవంతే.. ఇష్టమైన వ్యక్తితో జీవితాన్ని పంచుకోగలుగుతున్నానన్న ఆనందమే మరింత!" సరదాగా అన్నాను.

అవును ... పెళ్లి ఏ పద్ధతిలో ఎలా జరిగినా ఒకటే! ఆ తర్వాతి జీవితమే ముఖ్యం! విష్ణు పక్కనుంటే చాలు... ఈ జీవితానికి ఇంతకంటే ఇంకేంకావాలి అనిపించేంత హా... యిగా ఉంటుంది! చందమామను అందరూ ఇష్టపడతారు.. అందులో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ.. ఆ చందమామే సామాన్యమైన వ్యక్తి పట్ల ఇష్టం చూపిస్తే... అది నిజంగా అపురూపమైన అదృష్టమే! విష్ణు సహజీవనం లభించటం నాకు అలాంటి అదృష్టంలానే అనిపిస్తుంది!

విష్ణు సుతారంగా నా తలమీద తట్టి "ఏమిటి... నువ్వు ఆలోచనలో పడ్డావ్..?" అన్నారు. తన అరచేతిని నా చెంపకు ఆనించుకుని ఒక విధమైన భావోద్వేగంతో "ఆలోచన కాదు... అనుభూతి... మొగలిపూలగాలి ముత్యాల వాన!" అన్నాను.

నా కళ్లు అరమోడ్పులయ్యాయి.

"ఏమిటీ.. మొగలిపూలగాలి.. ముత్యాల వానా..?! కొత్తగా ఉందే!" కళ్లెగరేశారు.

"కోరుకున్న వ్యక్తినే భర్తగా పొందగలిగిన అదృష్టవంతురాలైన అమ్మాయికి అతని సమక్షంలో అనుభవమయ్యే మధుర భావనే మొగలిపూల గాలి ముత్యాల వాన! ఒక పాటలో నాకిష్టమైన ఈ పదాన్ని పదే పదే కూనిరాగం తీసేదాన్ని! ఇప్పుడు అనుభవంలోకి వచ్చింది!" మురిపెంగా చెప్పాను.

"నీకు... మాటలతో కోటలు కట్టి... నన్నందులో మహరాజుని చేసి కూర్చో పెట్టటం బాగా చేతనవును.." అంటూ యిష్టంగా రెండు చేతులతో నన్ను దగ్గరకు తీసుకున్నారు.

## 9

ఆ రోజు

విష్ణు మామూలుగా ఆఫీసుకి వెళ్లిపోయారు. కాసేపు పక్కమీద బద్ధకంగా దొర్లాను. క్రిందకు వెళ్లి వంటగదిలో శాంతమ్మకు సహాయం చేద్దామనిపించింది. కానీ నేను వెళ్లే సరికి వంట అయిపోవచ్చింది.

డైనింగ్ హాలు నుంచి వరండాలోకి వెళ్లే ద్వారం పక్కనే ఒక చిన్న షో కేసు ఉంది. అందులో అడుగున్నర ఎత్తు ఉండే గాజు బొమ్మ ఉంటుంది. ఆగ్రా నుంచి అప్పుడెప్పుడో మామయ్యగారు తెచ్చిన ఆ బొమ్మ ఒక్కదాని కోసమే అక్కడ షోకేసు పెట్టించారని నీరజ చెప్పింది. మేలి ముసుగు వేసుకున్నట్లుగా ఉండే ఆ అమ్మాయి బొమ్మ చాలా అందంగా ఉంటుంది. దానిమీద దుమ్ము కొంచెం పేరుకుపోయినట్లుగా ఉందని, శుభ్రం చేయమని అత్తయ్య ఎవరికో చెప్పటం ఆ ఉదయమే విన్నాను.

ఆ పని చేద్దామనిపించి చిన్న బ్రష్, పాతబట్ట శాంతమ్మనడిగి తీసుకున్నాను. షోకేసు ముందు చిన్న స్టూలు వేసి ఎక్కాను.

వరండాలో ఉండే స్టాండింగ్ ఉయ్యాలలో అత్తయ్య కూర్చుని ఉంటే, కృష్ణ ప్రసాద్ కేన్ కుర్చీలో కాళ్లు బాగా చాపుకుని తలపైకెత్తి చూస్తూ కూర్చుని ఉన్నాడు. ఏదో మాట్లాడుకుంటున్నారు. పక్క గుమ్మం దగ్గరే ఉండటం వలన మాటలు వినిపించాయి.

"అలా ఎందుకు చేసినట్లు? అంతా సెటిల్ అయ్యాక కాదనటం ఏమిటీ.. మామయ్య ఏమన్నాడు?"

దేని గురించో తెలియదు.. అత్తయ్య అడుగుతున్నారు.

"దీనికంతటికీ కారణం నువ్వే! పెళ్ళి ప్రసక్తి వచ్చిన రోజునే ఒకరి మరణం, ఒకరు మంచం పట్టటం జరిగింది! దీన్ని బట్టే ఎంత నష్టజాతకురాలో తెలుసుకుని పెళ్లికి అభ్యంతరం చెప్పాల్సింది పోయి, తెచ్చి ఇంట్లో పెట్టుకున్నప్పుడు అనుభవించక

తప్పుతుందా...?! ఇలాంటి నష్టాలే కాదు.. ఇంకా ఎన్నో అనర్థాలు జరిగాక గానీ నీకు తెలిసి రాదు.. మంచికైనా, చెడ్డకైనా కోడలొచ్చిన వేళావిశేషమనేది ఉంటుందని పెద్దలు చెప్పనే చెప్పారు! కోడలు నష్టజాతకురాలైతే కుటుంబం అంతా..."

కృష్ణప్రసాద్ మాటలు వింటూంటే.. నాకు ఒళ్లంతా జలదరించింది! నన్ను .. నన్ను గురించేనా అలా అంటున్నాడు..?! కళ్లు చీకట్లు కమ్మినట్లయింది.. చేయి వణికింది. బొమ్మను అక్కడ ఉంచి స్టూలు దిగబోయాను కాబోలు.. కాలు మెలికపడి స్టూలు తిరగబడటంతో.. నేనూ, చేతిలో బొమ్మా క్రిందపడ్డాం.

భ...ళ్లు...న శబ్దంతో గాజు బొమ్మ ముక్కలైంది! చేతికి ఒక పెంకు గుచ్చుకుని రక్తం కారింది.

ఆ శబ్దానికి పక్కగదిలో నుండి అత్తయ్య, కృష్ణ ప్రసాద్, వంటగదిలో నుండి శాంతమ్మ, కామాక్షి అత్తయ్య వచ్చేశారు.

తలఎత్తి వాళ్ల వేపు చూడలేకపోయాను. ఒక్కసారిగా నా తల టన్ను బరువు పెరిగిపోయినట్లుగా అనిపించింది! "అయ్యో.." అంటూ వంటగదిలోకి వెళ్లిన శాంతమ్మ మెత్తటి బట్టతో క్షణంలోనే తిరిగి వచ్చింది.

రక్తం కారుతున్న చోట మణికట్టు దగ్గర చీర చెంగును చుట్టేసుకుని ఎలాగో లేచి నిలబడి పరుగులాంటి నడకతో గదిలోకి వచ్చి పడ్డాను.

కళ్ల నుండి ఆగకుండా కారిపోతున్న కన్నీళ్లతో దిండు తడిసినట్లయిపోయింది!

మా పెళ్లి ప్రసక్తి వచ్చిన రోజునే శ్రీలక్ష్మి చనిపోవటం... మామయ్య గారికి అనారోగ్యం కలగటం... నా నష్టజాతక ప్రభావం వల్లనే జరిగాయా..?!

అలా మాట్లాడింది ఎవరో చదువు, సంస్కారం లేనివాళ్లు కాదు! విద్యాధికుడైన కృష్ణ ప్రసాద్ నోటి వెంట అలాంటి మాటలు రావటం.. నమ్మలేకపోతున్నాను.. కానీ నిజమేగా!

విష్ణుతో సహజీవనం లభించటం.. భగవంతుడు నాకు అనుగ్రహించిన వరమని నేను అనుకుంటాను. అదే ఈ కుటుంబానికి శాపమైందని వీళ్లందరూ అనుకుంటున్నారు కాబోలు!

తోడబుట్టిన వాళ్లు లేకుండా ఒంటరిగా పెరిగిన నేను ఉమ్మడి కుటుంబంలోకి కోడలుగా వెళ్లి వాళ్లందరి ఆదరాభిమానాలతో ఆ లోటును తీర్చుకోవాలని అమాయకంగా ఎ..న్ని కలలు కన్నాను..?!

నా పరుగు ఎండమావుల వెంటేనని ఇప్పటికి అర్థమైంది!

లోలోపల నుండి దుఃఖం ఎగదన్నుకు వచ్చింది!

నా ప్రేమయం లేకండా, నాకు తెలియకుండా ఏదైనా తప్పు జరిగితే.. దానికి నేనేం చేయగలను..? నా బాధ్యత ఏముంటుంది..? నన్ను నేనే ఓదార్చుకునే ప్రయత్నం చేశాను. అయినా నష్టజాతకం అనేమాట పదేపదే మనసును ముల్లులా గుచ్చుతూనే ఉంది!

తలుపు మీద చిన్నగా శబ్దం చేసి నీరజ లోపలకు వచ్చింది. ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లటానికి రెడీ అవుతుంటే ఈ విషయం తెలిసి హడావుడిగా వచ్చిందట.

నీరజ ఏదో చెప్పబోతుంటే, నేను తల తిప్పుకుని "ఎవరైనా తమ అభిప్రాయాల్ని, మనసులోని మాటల్నీ చెప్పుకుంటారు. అందులో తప్పేం లేదు! నేను వినాలని, నన్ను బాధ పెట్టాలనీ తను అనలేదుగా. అనుకోకుండా నేను వినటం జరిగిందంతే. దానికి బాధపడాల్సిన పనిలేదని నాకూ తెలుసు.. ఫరవాలేదు, సంజాయిషీ అవసరం లేదు!" అన్నాను.

గొంతును మామూలుగా తెచ్చుకోవటానికీ, కన్నీళ్లు జారకుండా నిగ్రహించుకోవటానికి ప్రయత్నించాను.

పక్కకు చూస్తున్న నా తలను తన వేపుకు తిప్పుకుని, నా చేయి పట్టుకుని "ముందు నేను చెప్పేది కొంచెం వినూ.." అంది.

అసలు విషయం ఏమిటంటే అంటూ జరిగిన సంగతిని వివరించింది.

ముందు ముందు కృష్ణప్రసాద్ కోసం హాస్పిటల్ కట్టటానికని ఒక మంచి ప్లాటును బేరం చేశారు. అడ్వాన్సు ఇచ్చారుగానీ అగ్రిమెంటును రాయించుకోలేదు. మామయ్యగారి అనారోగ్యం గొడవలో పడి ఆ విషయం మీద దృష్టి పెట్టక తాత్సారం చేశారు. దాంతో ఆ స్థలం అమ్ముతానన్న పెద్ద మనిషి ఇప్పుడు అమ్మనంటూ అడ్వాన్సు ఇచ్చేస్తానని మాట మార్చేశాడు. రేటు పెంచుతామన్నా వినటం లేదు. ఈ బేరసారాలన్నీ విష్ణు వాళ్ల మామయ్య కోదండంగారి ద్వారానే జరిగాయి. అందరూ ఇలా అనుకుంటున్నారని ఆయన కృష్ణప్రసాద్‌తో చెప్పిన మాటల్నే అత్తయ్యతో అలా యథాతథంగా చెబుతుంటే నేను వినటం జరిగింది. కృష్ణ ప్రసాదే అలా మాట్లాడుతున్నాడని నేను పొరబడి ఉంటానని అతను బాధపడుతున్నట్లుగా నీరజ చెప్పింది.

నేను తలతిప్పి అటు చూసేసరికి కృష్ణప్రసాద్ గుమ్మం దగ్గర నిలబడి ఉన్నాడు. కాటన్, బ్యాండేజ్ క్లాత్ లాంటి సరంజామా ఉన్న చిన్న బ్యాగ్ కూడా తీసుకువచ్చాడు. కుర్చీని మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చుంటూ "ఏదీ.. చెయ్యి చూడనివ్వండి..." అన్నాడు.

"గాయం చిన్నదే... రేపటికే మానిపోతుంది. బొమ్మే... చాలా ఖరీదైనది చేజారింది. పొరపాటు జరిగింది..." చింతిస్తున్నట్లుగా... బింకంగా అన్నాను.

"మీకు కోపం రావటం సహజమే. చేజారిన వస్తువుల గురించి ఆలోచించాల్సిన పనిలేదు... మళ్లీ కొనుక్కోగలం. మన ప్రయత్నాలు ఫలించటానికీ, ఫలించకపోవటానికీ ఇంకెవరి జాతకమో కారణమని ఆరోపించేంత మూర్ఖుడిని నేను... కానని మీరు నమ్మితే చాలు! కాకపోతే.. ఎవరో మూర్ఖులన్న మాటలను అక్కడే మర్చిపోకుండా డైరెక్ట్ స్పీచ్‌లో రిపీట్ చెయ్యటంలో మాత్రం నా తప్పు ఉంది. క్షమించేయండి.. ఇవే కాళ్లు అనుకోండి..." చనువుగా అంటూ నా చేతుల్ని పట్టుకోబోయి ఆగాడు. "కాళ్లే అందుబాటులో ఉండగా చేతుల్ని కాళ్లనుకోవటం ఎందుకూ..." చిరునవ్వుతో అని రెండు చేతుల్నీ నా కాళ్ల మీద ఉంచాడు.

"ఛ...ఛ.. ఇదేమిటీ.." అంటూ కాళ్లు ముడుచుకున్నాను. అలా చేస్తాడని ఊహించలేదు.

"నా చేతుల్ని.. ఛ... ఛ.. అని తీసిపారెయ్యకండి.. ఇవి ఆపరేషన్లు చేయటానికీ, రోగులకి సేవ చేయటానికీ ఉపయోగపడే చేతులు మరి!" నవ్వుతూ సరదాగా అన్నాడు.

అప్రయత్నంగా నా పెదవులపైకి చిరునవ్వు వచ్చింది. "నేనూ.. మూర్ఖురాలిని కాదు. వైద్యుడంటే భగవంతుడి మరో రూపమని అంటారు కదా! నారాయణుడి కరకమలాల్ని ఛ... ఛ అంటానా?!"

కృష్ణప్రసాద్ "అయితే మీ కోపం పోయినట్లేగా వదినా.." అంటూ చిన్నగా నవ్వాడు.

ఆ పిలుపు నాకు తీయగా, సంగీతంలా వినిపించింది!

"కోపం దేనికసలు! గాయమైతేనే డాక్టరుగారు పరామర్శిస్తారని తెలిస్తే.. ఈ పని నా అంతట నేనే చేసివుండేదాన్ని!" చేతి గాయం వైపు చూస్తూ అన్నాను.

నీరజ కాటన్‌తో శుభ్రం చేసిన చోట కృష్ణప్రసాద్ అయోడిన్ కాబోలు రాసి బ్యాండేజి క్లాత్‌తో కట్టుకడుతూ “నా మొదటి తప్పును కూడా క్షమించెయ్యండి...” అన్నాడు.

అదేమిటని అడగబోయి ఆగిపోయాను. ఇన్నాళ్లు నన్ను పలుకరించకపోవటమే తన మొదటి తప్పుగా అంటున్నాడని అర్థమైంది!

నవ్వేశాను.

రెస్టు తీసుకోమని చెప్పి ఇద్దరూ వెళ్లిపోయారు.

❋ ❀ ❋